క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

సంగారెడ్డి : పట్టణం టౌన్ – 2 పరిధిలోని 11కేవీ సబ్‌స్టేషన్ ఫీడర్లలో చెట్ల కొమ్మలు నరికివేత కారణంగా శనివారం ఉ.10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతినగర్, కల్వకుంట రోడ్డు ప్రాంతం, ఆంటోని పాఠశాల ఏరియా, మీసేవ, తేజ కళాశాల, జమాల్ షరీఫ్, రాజీవ్‌పార్క్ ప్రాంతం, మల్లికార్జుననగర్, చాణక్యపురి కాలనీ, మెథడిస్ట్ చర్చి ప్రాంతాలలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

నారాయణఖేడ్: ఖేడ్ రాజీవ్‌చౌక్‌లో ఎస్‌ఐ శ్రీశైలం, ఎస్‌ఐ మొగులయ్య ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. అన్ని రకాల వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనదారులు ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు విధిగా కలిగి ఉండాలని సూచించారు. వాహనాల కెపాసిటీ మేరకే ప్రయాణించాలని, గంజాయి, మత్తు పదార్థాలు రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుర్తింపు రద్దు చేయాలి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సంగారెడ్డి రూరల్ : రెండవ శనివారం హాలిడే ఇవ్వకుండా స్కూల్స్ నడుపుతున్న ప్రైవేటు విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ డిమాండ్ చేశారు. శుక్రవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంగారెడ్డి డీఈఓ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ.. ప్రైవేటు విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ రెండవ శనివారం పాఠశాల నడుపుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు సాయి, దౌజానాయక్, శివ, తను పాల్గొన్నారు.

వృథాగా తాగునీరు



రోడ్డుపై పారుతున్న నీరు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ డబుల్ బెడ్ రూం కేసీఆర్‌నగర్‌లో తాగునీరు వృథాగా పోతోంది. అనేక ప్రాంతాల్లో ప్రజలు తాగునీరు లేక ఇబ్బందులు పడుతుంటే ఇక్కడ మాత్రం తాగునీరు వృథా పోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎస్‌డీజీ నిర్వహణ

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని సెయింట్ అంథోని హైస్కూల్లో శుక్రవారం సస్టేనబుల్ డెవలప్‌మెంట్ లక్ష్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఈదర ఇన్నారెడ్డి మాట్లాడుతూ.. అక్షరాస్యత, పేదరిక నిర్మూలన, లింగ సమానత్వం, పరిశుభ్రత, సహజ వనరుల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మహిళల ఆర్థిక భద్రతే లక్ష్యం

- పొదుపు సంఘాలకు కారు డ్రైవింగ్ శిక్షణ
- బ్యాంకుల ద్వారా సంఘాలకు రుణాలు



ఉచిత డ్రైవింగ్ శిక్షణ పొందుతున్న మహిళలు

సంగారెడ్డి టౌన్ : మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను రూపొందిస్తోంది. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజ్, శ్రీనిధి రుణాలు అందిస్తూ వ్యాపారులుగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహిస్తోంది. సంఘాల సభ్యుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుంది. బ్యాంకర్లు రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో మొత్తం 1,95,010 మహిళా సభ్యులు ఉన్నారు. స్వయం సహాయక సంఘాలు 18,450 ఉండగా.. గ్రామ సమైక్య సంఘాలు 695, మండల సమైక్య సంఘాలు 25 ఉన్నాయి. మహిళలు స్వయం సమృద్ధి సాధించడంతో పాటు మరో పదిమందికి ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుంది. అందులోనే భాగంగా మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కార్ డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నారు. 30 రోజుల పాటు 115 మంది మహిళలను 35 బ్యాచులుగా ఏర్పాటు చేశారు. మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులోనే భాగంగా హైదరాబాద్‌లోని వివిధ కంపెనీల్లో మహిళలకు మహిళా సంఘాల ద్వారా క్యాబ్‌లను ఏర్పాటు చేసి వారికి భరోసా కల్పించాలని లక్ష్యంతో శిక్షణ ఇస్తున్నారు.

సంఘం సభ్యులుగా ఉండాలి

జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు వచ్చి శిక్షణ పొందుతున్నారు. శిక్షణతో పాటు లైసెన్సులు కూడా ఇచ్చేలా ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

సంతోషంగా ఉంది



సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్ పేట గ్రామానికి చెందిన మమత మహిళా సంఘం సభ్యురాలుగా ఉన్నారు. కారు డ్రైవింగ్ నేర్చుకోవడం సంతోషంగా ఉందని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతామని కారు డ్రైవింగ్ చేసి లాభాలు పొందుతామన్నారు.

– మమత

జీవనోపాధి పొందుతాం



అందోల్ మండలం నాద్లాపూర్ గ్రామానికి చెందిన సద్గుణ డ్రైవింగ్‌లో శిక్షణ పొందుతుంది. కారు డ్రైవింగ్ నేర్చుకొని శ్రీనిధి ద్వారా రుణాలు తీసుకొని కారు తీసుకొని క్యాబ్ నడిపిస్తూ జీవనోపాధి పొందుతానని ధీమా వ్యక్తం చేశారు.

– సద్గుణ

సద్వినియోగం చేసుకోవాలి



మహిళా సంఘాల ద్వారా గ్రామీణ ప్రాంత మహిళలకు కారు డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొట్టమొదటిసారిగా జిల్లాలోనే మహిళా సంఘాల సభ్యులకు కార్ డ్రైవింగ్ శిక్షణ కల్పిస్తున్నాం. శిక్షణ పొంది ఉపాధి పొందవచ్చన్నారు.

– జిల్లా అదనపు డీఆర్డీఓ

గ్రామపంచాయతీ ఏర్పాటుకు వినతి



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

సంగారెడ్డి జోన్: తమ గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబాను కోరారు. శుక్రవారం సంగారెడ్డిలోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో మాజీ ఎంపీపీ హన్మంత్‌రావు పాటిల్‌తో కలిసి సంగం(కె) గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. తమ గ్రామం ఎన్నో సంవత్సరాలుగా తుమ్మన్‌పల్లి గ్రామపంచాయతీలో విలీనం ఉండటంతో గ్రామం అభివృద్ధి జరగడం లేదన్నారు. గ్రామస్తులు అందరూ కలిసి ఏకగ్రీవంగా పంచాయతీ ఏర్పాటుకు తీర్మానం చేశామని చెప్పారు. పంచాయతీ ఏర్పాటుతోనే గ్రామ అభివద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు లక్ష్మారెడ్డి, సుధాకర్ రెడ్డి, అంజిరెడ్డి, రాజు,రమేష్, రామ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా..



మాట్లాడుతున్న డిజినల్ మేనేజర్ సమత

సంగారెడ్డి టౌన్ : గ్రామాల్లో బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ డిజినల్ మేనేజర్ సమత అన్నారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలోని కొన్ని జిల్లాలకే మాత్రమే పరిమితమైన ఈ బ్యాంకు సేవలను రాష్ట్ర వ్యాప్తంగా అమలు అయ్యేలా చూస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకును తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ హరీశ్, సీనియర్ మేనేజర్ అడ్మినిస్ట్రేటివ్ రామకృష్ణ, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపులతో ప్రయోజనం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పటాన్‌చెరు: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపును లక్డారం ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. పటాన్‌చెరు అమేధా ఆస్పత్రి వైద్యులు రాజేంద్ర, రవి గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అదేవిధంగా సాత్విక్ రూరల్ అండ్ యూత్ ఇంటిగ్రేటెడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గర్భిణులు విద్యార్థులు, వృద్ధులకు పోషక ఆహారాన్ని ఉచితంగా సరఫరా చేశారు. కార్యక్రమంలో రాజమాత ఫౌండేషన్ నిర్వాహకులు ఉదయ్‌కుమార్‌రెడ్డి, జనం కోసం మనం ఫౌండేషన్ నిర్వాహకులు హరికృష్ణ, శశికళ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రొఫెసర్ భీమ్‌సింగ్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా సర్వే పూర్తి చేయండి



సర్వే చేస్తున్న ప్రత్యేకాధికారి నూతన్‌కుమార్



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీఓ మహేందర్ రెడ్డి

కంగ్టి(నారాయణఖేడ్): ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే పనులు పూర్తిచేయాలని ఏడీఏ, మండల ప్రత్యేకాధికారి నూతన్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని చాప్టా(బీ), కంగ్టి, తుర్కవడ్‌గాం గ్రామాల్లో ఇంటింటికి తిరిగి పంచాయతీరాజ్ అధికారులతో కలిసి సర్వే నిర్వహించారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మండలంలో 12,090 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. సర్వే అధికారులు పూర్తి వివరాలు సేకరించి నిరుపేదలను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ సుభాష్, ఆయా గ్రామ పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా సర్వే చేయాలి

కంది(సంగారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీఓ మహేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని ఎర్దనూరు తండా, చర్లగూడెం, తోపుగొండ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేలో అర్హులైన వారందరి వివరాలు జాగ్రత్తగా పరిశీలించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. గతంలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరి సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. కంది మండలానికి 9444 ఇళ్లు మంజూరు అయ్యాయని ఎంపీఓ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బందితో పాటు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలకు కృషి



డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్: ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తామని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. శుక్రవారం డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ఖేడ్ నుంచి కంగ్టి, తడ్కల్ మీదుగా హైదరాబాద్‌కు బస్సులు నడపడంతో పాటు కంగ్టి నైట్‌హాల్ట్ బస్సును పునరుద్ధరించాలని పలువురు ఫోన్ ద్వారా కోరారు. రాంసాన్‌పల్లి స్టేజీలో బస్సు స్టాప్ ఏర్పాటు చేయాలని పలువురు విన్నవించారు. 15 రోజులుగా నిలిపివేసిన మోర్గి మీదుగా బీదర్ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని తెలియజేశారు. కల్హేర్, నిజాంసాగర్‌లకు బస్సులు నడపాలని కొందరు విజ్ఞప్తి చేశారు.

న్యాయం చేయండి

పటాన్‌చెరు: పట్టణ శివారులో సొంత జాగాలో ప్రహరీ నిర్మిస్తే టీఎస్ఎస్సీ అధికారులు కూల్చివేశారని శ్రీనిధి డెవలపర్స్ ప్రతినిధి భాస్కర్ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఆ సంస్థ ప్రతినిధి భాస్కర్ ఫిర్యాదు వివరాలను విలేకరులకు తెలియజేశారు. సర్వే నంబర్ 833 నుంచి 837 వరకు 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న స్థలాన్ని తాను కొనుగోలు చేశానని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

జహీరాబాద్ టౌన్: పట్టణంలో సెమీ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి చంద్రశేఖర్ కేక్‌కట్ చేసి క్రైస్తవ సోదరులకు ముందస్తు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు కలుగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింలు, కోహీర్, మొగుడంపల్లి మండలాల అధ్యక్షుడు రాంలింగారెడ్డి, మక్సూద్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వంశీ, పాస్టర్లు పాల్గొన్నారు.

నేడు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): యూసీ బ్రెస్ట్ ఫౌండేషన్, తెల్లాపూర్ నైబర్‌హుడ్, మున్సిపల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఉచిత రొమ్ము క్యాన్సర్ స్కానింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి శుక్రవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరం ఉ. 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమతుల్య ఆహారంపై అవగాహన



మాట్లాడుతున్న శాస్త్రవేత్త హేమలత

జహీరాబాద్ టౌన్: సమతుల్య ఆహారంపై డీడీఎస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు గర్భిణులు, బాలింతలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కేవీకే శాస్త్రవేత్త హేమలత మాట్లాడుతూ.. గర్భిణీల్లో రక్తహీనత సమస్య వస్తుందని, పోషకాహారం తీసుకోవడం వల్ల నివారించవచ్చని చెప్పారు. ఆరోగ్యంగా ఉంటేనే పిల్లల్లో పోషక సమస్యను అధిగమించవచ్చని తెలిపారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పుష్ప గర్భిణీలు, బాలింత మహిళలు పాల్గొన్నారు.

మహా పడిపూజ



పడిపూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల కేంద్రంలో గురువారం రాత్రి అయప్పస్వామి మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. మెట్ల పూజ, అభిషేకం, తీర్థప్రసాదం, తదితర కార్యక్రమలు చేపట్టారు. ఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, అయ్యప్ప దీక్షదారులు బిరదర్ రవీందర్‌రావు, కిరణ్‌రావు, యాదవరావు, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల తనిఖీ



రాయికోడ్: గురుకుల పాఠశాలలో ప్యానెల్ బృందం సభ్యులు



కంగ్టి : కోడిగుడ్లు పరిశీలిస్తున్న నూతన్‌కుమర్

రాయికోడ్(అందోల్): మండలంలోని అల్లాపూర్ గ్రామ శివారులోని సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను మండల విద్యాధికారి వి.అంజయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ప్యానెల్ బృందం తనిఖీ చేసింది. పాఠశాలలో విద్యార్థులకు బోధించిన పాఠ్యాంశాల వివరాలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు బోధించే తరగతులను తనిఖీ చేశారు. బోధన ప్రక్రియలో ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల అభ్యాసనాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్యానెల్ బృందం ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, బృందం సభ్యులు, ప్రిన్సిపాల్ దత్తురాణి, ఉపాధ్యాయులు,విద్యార్థులు ఉన్నారు.

నల్లవాగు గురుకులం తనిఖీ

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం నల్లవాగు గురుకుల పాఠశాలను శుక్రవారం ప్యానెల్ టీం తనిఖీ చేసింది. ఎంఈఓ, ప్యానెల్ టీం లీడర్ నాగరం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురుకులంలో బోధన అంశాలు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపతయ్య, టీం సభ్యులు ఎంఏ. రహీం, లక్ష్మన్, మహేందర్, నిర్మల, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

కంగ్టి(నారాయణఖేడ్): మెనూ ప్రకారం గురుకులాలు, హాస్టళ్ల విద్యార్థులకు భోజనాలు పెట్టాలని మండల ప్రత్యేకాధికారి నూతన్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని తడ్కల్, కంగ్టి గ్రామాల్లో బీసీ, ఎస్సీ వసతి గృహాలను పరిశీలించారు. కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థుల భోజనం తనిఖీ చేశారు. బాలుర వసతి గృహంలో వంటలకు వాడుతున్న నిత్యావసర వస్తువుల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు రామప్ప, పండరి, జ్యోతితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మోడల్ హౌస్‌కు స్థలం పరిశీలన**

కల్హేర్(నారాయణఖేడ్): ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి కల్హేర్‌లో శుక్రవారం అధికారులు స్థలం పరిశీలించారు. ఎంపీడీఓ రమేష్‌బాబుతో కలిసి హౌసింగ్‌శాఖ స్పెషల్ ఏఈ సతీష్ స్థల పరిశీలన చేశారు. మండల పరిషత్తు కార్యాలయం ఎదుట స్థలం ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ **బాధిత వ్యక్తికి పరామర్శ**

జిన్నారం (పటాన్‌చెరు): సెంట్రింగ్ పని చేస్తూ ప్రమాదవశాత్తు మొదటి అంతస్తు నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డ కమ్మరి శ్రీనివాస్ చారిని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం మండల అధ్యక్షుడు రవీంద్రచారి, సభ్యులు సత్యనారాయణ చారి, లక్ష్మణ్‌చారి, విగ్నేష్ చారి, రమేష్ చారి పాల్గొన్నారు.

◆ **వైభవంగా దుర్గామాత ఆలయ వార్షికోత్సవం**

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండలంలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలోని దుర్గామాత ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పురోహితుడు ఆనంద్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం మహాగణపతి పూజ, దేవతా ప్రార్థన, మహా మంగళహారతి, అమ్మవారి మూల విగ్రహానికి పంచామృతాభిషేకం, విశేష పుష్పలంకరణ చేసి పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం శివపార్వతుల కల్యాణం చేశారు. నవీన్ రెడ్డి, రాధిక దంపతుల చేతుల మీదుగా కల్యాణ తంతు జరిగింది. కళ్యాణ మహోత్సవంలో మహిళ భక్తులతో పాటు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

◆ **అక్రమ నిర్మాణాలు కూల్చివేత**



జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను అక్రమంగా కబ్జా చేసి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. శుక్రవారం వైఎస్సార్ కాలనీలోని సర్వే నంబర్ 284లో ప్రభుత్వ పార్క్ స్థలాన్ని ఆక్రమించి గుర్తు తెలియని వ్యక్తులు చేపడుతున్న ఏసీసీ గదిని టౌన్ ప్లానింగ్ సిబ్బంది కూల్చేశారు. అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది నవీన్ స్థానికులు పాల్గొన్నారు.

◆ **సమస్యల పరిష్కారానికి చర్యలు**

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని జె.పికాలనీ, ముదిరాజ్ భవన్, శాంతినగర్ కాలనీలో జీహెచ్ఎంసీ డీజీఎం శివకుమార్‌తో కలిసి పర్యటించి డ్రైనేజీ సమస్యలు పరిశీలించారు. అనంతరం అంబేడ్కర్ కాలనీలోని ప్రభుత్వ బాలుర వసతిగృహాన్ని పరిశీలించారు. జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు డివిజన్ పరిధిలో డ్రైనేజీల పూడికతీత తీయాలని సూచించారు.

◆ **ఆలయాల నిర్మాణానికి భూమిపూజ**

నారాయణఖేడ్: నిజాంపేట మండలం మాణిక్‌నాయక్ తండాలో దుర్గాభవానీమాత, సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయాల నిర్మాణానికి శుక్రవారం అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహరాజ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం ఆలయ నిర్మాణ ప్రదేశంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

◆ **కంటి ఆపరేషన్లు విజయవంతం**

నారాయణఖేడ్: 23 మంది వృద్ధులకు నిర్వహించిన కంటి శస్త్రచికిత్సలు విజయవంతం అయినట్లు సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు శంకరప్ప శుక్రవారం తెలిపారు. పట్టణంలో ఈనెల 18న సత్యసాయి 100వ జన్మదిన వేడుకల్లో భాగంగా స్థానిక శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించి 23 మందికి క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వారిని శస్త్రచికిత్సల కోసం హైదరాబాద్ నానక్‌రాంగూడలోని శంకర కంటి ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లారు. అక్కడ శస్త్రచికిత్సలను నిర్వహించి శుక్రవారం ఖేడ్‌కు తీసుకువచ్చారు.

◆ **నేడు సరఫరాలో అంతరాయం**

నారాయణఖేడ్: మనూరు మండలం బోరంచలోని ఇన్‌టెక్‌వెల్‌లో శుక్రవారం ఏర్పడ్డ విద్యుత్ సమస్య ఏర్పడింది. దీంతో నియోజకవర్గంలోని 250 ఆవాస ప్రాంతాలకు శనివారం మిషన్ భగీరథ నీటిసరఫరా జరగదని మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ గాయత్రి, ఏఈ తిరుమలేష్ గౌడ్ తెలిపారు. తాగునీటి కోసం స్థానికంగానే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఆదివారం నుంచి యథావిధిగా నీటి సరఫరా జరుగుతుందన్నారు.

◆ **నాణ్యమైన భోజనం అందించాలి**

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల పంచాయతీ అధికారి హరిశంకర్ గౌడ్ అన్నారు. శుక్రవారం పటాన్ చెరు మండలం చిన్న కంజర్ల గ్రామంలోని మహాత్మాజ్యోతి బాపూలే వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వంటశాలలో ఆహార పదార్థాలను, బియ్యం పరిశీలించారు. అనంతరం విద్యార్థుల నూతన మెనూ అమలుపై ఆరా తీశారు.

సాధనతోనే అభ్యసన మెరుగు



విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న శంకర్

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): అభ్యసన నిరంతరం కొనసాగిస్తేనే విద్యార్థి సామర్థ్యాలు మెరుగుపడతాయని ఎంఈఓ శంకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని అంకేనపల్లి, చందాపూర్ ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మాట్లాడటం, చదవడం, రాయడం, అవగాహన పెంచుకోవాలి. గణితంలో చతుర్విధ ప్రక్రియలు, ప్రతి సబ్జెక్టులో నిర్దేశించిన ఫలితాలు సాధించేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు పాఠ్యప్రణాళిక, డైరీ, కేస్‌స్టడీ, వెనుకబడిన విద్యార్థుల జాబితా, వారి అభివృద్ధికి దోహదపడే కృత్యాలు మొదలుగునవి ఏ రోజుకారోజు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, రమాదేవి,అమ్మఆదర్శ కమిటీ చైర్మన్ కళావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.